
కోడి కూతకు ముందే కిక్కు

- బార్ నిర్వాహకుల ఇష్టారాజ్యం
- సమయపాలనకు తూట్లు
- తెల్లవారుజాము నుంచే మద్యం విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు





బద్వేలులో ఓ బార్‌లో తెల్లారకముందే మందుబాబుల సిట్టింగ్

బద్వేలుటౌన్, జనవరి 30: మందుబాబులు కిక్కు కోసం ఉదయం 11గంటల వరకు ఆగాల్సిన పని లేదు. కోడి కూతకు ముందు నుంచే బార్‌లను టీషా పుల్లా తెరుస్తున్నారు. దీంతో తెల్లవారుజాము నుంచే తాగి ఊగుతున్నారు. సమయపాలనకు తూట్లు పొడుస్తూ బార్ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. దశల వారీగా మద్య నిషేధం అమలు చేసి 2024 ఎన్నికల నాటికి మద్యం అనేది సామాన్యులకు అందుబాటులో లేకుండా, కేవలం ఫైవ్‌స్టార్ హోటళ్లకు మాత్రమే పరిమితం చేస్తామని గత ఎన్నికల ప్రచారంలో వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కాగానే ఆయన మద్య నిషేధం అమలు చేయకపోగా.. మద్యం అమ్మకాలు పెంచడంతో పాటు ఈ ఆదాయాన్ని చూపి రుణాలు సైతం తెచ్చారు. మందుబాబులతో మరింతగా మందు తాగించడమే లక్ష్యంగా మద్యం పాలసీ అమలవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. మందుబాబుల బలహీనతను దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజాము నుంచే బార్ అండ్ రెస్టారెంట్లు తెరుస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బద్వేలు పట్టణంలో రెండు బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10గంటలకు బార్ తెరవాలి. రాత్రి 11 వరకు మద్యం విక్రయాలు చేసుకోవచ్చు. ఫుడ్ విషయంలో ఒక గంట మినహాయింపు ఇచ్చారు. అయితే బార్ నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన సమయపాలన పాటించడం లేదని సమాచారం. వీరికి రాజకీయ అండతో పాటు అధికారుల సహకారం మెండుగా ఉందనే వాదన వినిపిస్తోంది.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో మాత్రమే బార్ అండ్ రెస్టారెంట్లు తెరిచి ఉంచాలి. ఉదయం 10 నుంచి రాత్రి 11గంటల వరకు మాత్రమే మద్యం విక్రయాలు జరగాలి. సమయపాలన లేకుండా నిబంధనలు అతిక్రమించి విక్రయాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

- సుభాషిణి, ఎక్సైజ్ ఎస్ఐ

అధిక ధరలకు విక్రయాలు

బద్వేలు పట్టణంలో కోడి కూతకు ముందే రెండు బార్లు టీ దుకాణంలా తెరుచుకుంటున్నాయి. ఆ సమయంలో మద్యం ధరలకు రెక్కలు వస్తాయని అంటున్నారు. మందుబాబుల అవసరాన్ని బట్టి ఇష్టానుసారంగా అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారు. దీంతో మద్యానికి బానిసలైన కూలీలు తెల్లవారు జామునే మద్యం కొనుగోలు చేసి తాగడంతో ఆరోగ్యంతో పాటు డబ్బూ పోగొట్టుకుంటున్నారు.



కోడికూతకు ముందే మద్యం కొనుగోలు చేస్తున్న మద్యం ప్రియులు

మద్యం దుకాణాల్లో బ్రాండ్లు లేక

ఇదిలా ఉండగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో తమకు కావాలసిన బ్రాండ్లు లేవని, విధి లేని పరిస్థితుల్లో బార్లకు వెళ్లాల్సి వస్తుందని మద్యంప్రియులు వాపోతున్నారు. పాలకులకు మందుబాబులపై ప్రేమ ఉంటే ధరలు తగ్గించి అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉంచాలని లేదా.. ప్రజల బాగు కావాలంటే మద్యపాన నిషేధం అమలు చేయాలని అంటున్నారు. కొందరు లారీ డ్రైవర్లు ఆటో డ్రైవర్లు, వాహనదారులు తెల్లారకముందే బార్లకు వెళ్లి మద్యం తాగి వాహనాలను నడుపుతున్నారు. తెల్లవారుజామున తాగిన మందు ఇచ్చే కిక్కు ఒక పక్క, మరో పక్క నిద్ర తక్కువై కునుకు వేయడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఏదీ

సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే బార్ అండ్ రెస్టారెంట్లు సమయపాలన పాటించడం లేదని, అధిక ధరల దోపిడీ సాగుతోందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. తెల్లవారుజాము నుంచే మద్యం లభిస్తుండడంతో కూలీనాలీ చేసుకునే మందుబాబులు మందు తాగేసి పనులకు వెళ్లడం లేదని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. బార్లపై అధికార యంత్రాంగం నిఘా పెట్టి సమయపాలన పాటించేలా చేయాలని వారు కోరుతున్నారు.

నిడిజువ్వి వద్ద నాపరాయి గనుల్లో సినిమా షూటింగ్



నిడిజువ్విలో రజనీకాంత్

ఎర్రగుంట్ల, జనవరి 30: తమిళ సినీ సూపర్‌స్టార్ రజనీకాంత్ మంగళవారం నిడుజువ్వి గనుల్లో జరిగిన షూటింగ్‌లో పాల్గొన్నారు. రెండు రోజులుగా ఇక్కడి గనుల్లో రజనీకాంత్ నటిస్తున్న చిత్ర యూనిట్ షూటింగ్ ఏర్పాట్లు చేస్తోంది. ఎర్రగుంట్లకు చెందిన సానేపల్లి మధుసూధనరెడ్డికి చెందిన నాప రాయి గనిలో రెండు రోజులపాటు షూటింగ్ జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం నుంచి జరిగిన షూటింగ్‌లో రజనీకాంత్ పాల్గొని తిరిగి గెస్టుహౌస్‌కు వెళ్లిపోయారు. బుధవారం సాయంత్రం వరకు ఇక్కడ షూటింగ్ జరుగుతుందని సమాచారం. అయితే షూటింగ్ సమయంలో ఆప్రాంతంలో ఎవ్వరిని అనుమతించడం లేదు. స్థానిక పోలీసులతో పాటు ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది అక్కడికి ఎవ్వరినీ రానీయకుండా చర్యలు చేపట్టారు. రజనీకాంత్‌ను చూసేందుకు వచ్చిన అభిమానులకు నిరాశే మిగిలింది. కొద్దిసేపు షూటింగ్‌లో పాల్గొన్న వెంటనే రజనీ తన చాంబర్‌లోకి వెళ్లిపోవడంతో అభిమానులు దూరం నుంచే సెల్ కెమెరాలతో ఫొటోలు తీసుకుని సంతోషపడ్డారు. రజనీ షూటింగ్ సందర్భంగా గనుల్లో కోలాహం నెలకొంది.



షూటింగ్‌లో పాల్గొన్న రజనీకాంత్

జగన్ ఇలాకాలో.. ఇదీ దుస్థితి

వేంపల్లె, జనవరి 30: పులివెందుల నియోజకవర్గం వేంపల్లె పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ పనులు అధ్వాన్నంగా తయారయ్యాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రోడ్లపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీళ్లలో దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ.56 కోట్లతో రోడ్ల విస్తరణ, రూ.96 కోట్లతో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయని, ప్రణాళిక లేకుండా పనులు చేపట్టారని విమర్శించారు. వాహనదారులు, దుకాణదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. మురుగునీరు దుకాణాల ముందు, ఇళ్ల ఎదుట నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సుష్మ, చంద్ర, మహేశ్‌రెడ్డి, గంగాధర్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లెలో రోడ్డులో నిలిచిన మురుగు నీళ్లలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

విగ్రహాల ధ్వంసం దారుణం



కడప తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

- విగ్రహాలను యధాస్థానంలో పునఃప్రతిష్ఠించాలి
- తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలి
- బీజేపీ, టీడీపీ, జనసేన, వీహెచ్‌పీ నేతల డిమాండ్



విగ్రహాలను పరిశీలిస్తున్న టీడీపీ, జనసేన నేతలు



విరిగిన విగ్రహాలను పరిశీలిస్తున్న ఆర్డీవో మధుసూదన్

కడప(మారుతీనగర్), జనవరి 30: కడప తహశీల్దార్ కార్యాలయ సముదాయంలో ఎన్నో ఏళ్లుగా నాగక్షేత్రంలో ఉన్న నవగ్రహ విగ్రహాలను కారు పార్కింగ్ కోసం తహశీల్దార్ శివరామిరెడ్డి పనిగట్టుకొని ధ్వంసం చేయించడం దారుణమని టీడీపీ, బీజేపీ, జనసేన, బీజేవైఎం, వీహెచ్‌పీఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధ్వంసం చేసిన నవగ్రహ విగ్రహాలను తక్షణమే యధాస్థానంలో పునఃప్రతిష్ఠింపచేయాలని డిమాండ్ చేశారు. కడప తహశీల్దార్‌ను విధుల నుంచి తొలగించి క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. ఈ మేరకు ఆయా పార్టీల నేతలతో పాటు పలువురు నగరవాసులు పెద్ద ఎత్తున మంగళవారం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తదనంతరం రాస్తారోకో చేపట్టారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి రాస్తారోకోను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ రోడ్డుపై బైఠాయించారు. టీడీపీ నేతలు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఆర్.మాధవిరెడ్డి, దుర్గాప్రసాద్, ఎం.బాలకృష్ణయాదవ్, బీజేపీ నేతలు బొమ్మన విజయ్, బత్తల పవన్‌కుమార్, ధశరధ్, జనసేన నేత సుంకర శ్రీనివాస్, వీహెచ్‌పీఎస్ బెస్తవేము రామ్‌మహేశ్ తదితరులు మాట్లాడారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో చల్లని నీడనిచ్చే చెట్లతో ఉన్న నాగక్షేత్రాన్ని తొలగించాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హిందువుల మనోభావాలు దెబ్బతినేలా దేవాలయాలు, దేవతా విగ్రహాలను ధ్వంసం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. ఇక్కడి నాగక్షేత్రాన్ని తొలగించి ఆ స్థానంలో తహశీల్దార్ కారుతో పాటుగా ఆయన కోసంవచ్చే వారు కార్లు పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా షెడ్ ఏర్పాటు చేసుకోవాలనుకోవడం సరైందికాదన్నారు. హిందువులు ఎంతగానో పూజించే నాగదేవతలతో ఆటలాడాలనుకోవడం మంచిది కాదన్నారు. ఆయన కడప తహశీల్దార్‌గా వచ్చినప్పటి నుంచి సుమారు 100 కోట్లకుపైగా అక్రమంగా వెనకేసు కున్నారన్నారు. అందుకే మనుషుల స్థలాలకు.. దేవతలు కొలువుదీరిన స్థలాలకు తేడా తెలియకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ధ్వంసం చేసిన నవగ్రహ విగ్రహాలున్న ప్రదేశంలోనే తిరిగి ప్రతిష్ఠింప చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. విషయం తెలిసిన ఆర్డీవో మధుసూదన్ అక్కడకు చేరుకుని వారిని సముదాయించారు. యధా స్థానంలో విగ్రహాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాగా.. విగ్రహాల తొలగింపు మంచిదికాదని, దయచేసి తనను క్షమించాలని కడప తహశీల్దార్ శివరామిరెడ్డి చెప్పడంతో అందరూ ఆందోళన విరమించారు.

టీడీపీలో 150 కుటుంబాలు చేరిక



వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. మంగళవారం మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో బీమఠం మండలానికి చెందిన 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

- వివరాలు 7వ పేజీలో

బైండోవర్ కేసులపై విచారణ జరపాలి

- కలెక్టరుకు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి వినతి



కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), జనవరి 30: జిల్లాలో ఎన్నికల దృష్ట్యా పోలీసులు నమోదు చేసిన బైండోవర్ కేసులపై విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టరు విజయరామరాజును కోరారు. ఈ మేరకు ఆయన కలెక్టరుకు వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీలో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనుండడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలకు విఘాతం కలిగించేవారిపై బైండోవర్ కేసుల నమోదుకు ఆదేశించిందన్నారు. అయితే పోలీసులు మాత్రం అధికార పార్టీ నాయకులకు లొంగి ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు సెక్షన్ 107 సీఆర్‌పీసీ నమోదు చేయాలంటే గతంలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి ఉంటే ఆ మేరకు మండల తహశీల్దారుకు వారి వివరాలను నివేదించాలన్నారు. పోలీసులు మాత్రం అటువంటి నిబంధనలు పాటించకుండా అధికారం చేతుల్లోకి తీసుకుని ఇష్టానుసారంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. దౌర్జన్యం, దాడులు చేసేది అధికార పార్టీ నాయకులేనని తెలిపారు. పులివెందుల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసినా అభివృద్ధి కనబడడం లేదన్నారు. 214 కి.మీ రోడ్డు ఏర్పాటుకు కేంద్రం నుంచి నిధులు వచ్చాయన్నారు. చెక్‌డ్యాంలు పూర్తి కాలేదన్నారు. ఎంత మందికి గన్‌మేన్లను కేటాయించారు, ఎంతమందికి తుపాకీ లైసెన్సులు ఇచ్చారో తెలపాలంటూ సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం ఇవ్వాలని అడిగినా ఇంతవరకు తనకు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మీడియా కోఆర్డినేటరు చెప్పలి జనార్ధన తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కదనోత్సాహం

- షర్మిల టూర్ సక్సెస్
- వైసీపీకి వ్యతిరేకంగా జగన్ అండ్ కోపై వివేకా ఫ్యామిలీ పోటీ



కడపలో సోమవారం జరిగిన కడప, అన్నమయ్య జిల్లాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలతో కరచాలనం కోసం ఎగబడుతున్న ఆ పార్టీ శ్రేణులు

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ లైఫ్ ఇచ్చింది. దివంగత సీఎం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కట్టుబానిసగా పనిచేసేవారు. కాంగ్రెస్ అంటే రాజశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అంటే కాంగ్రెస్ అన్న విధంగా ఉండేవారు. ఆ పార్టీ సైతం వైఎస్‌కు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చింది. 2004, 2009 ఎన్నికల్లో దివంగత వైఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో సత్తా చాటింది. లైఫ్ ఇచ్చిన పార్టీకి ఉన్నత స్థాయి కోసం వైఎస్ పాటుపడగా.. ఆయన కొడుకు మాత్రం ఆ పార్టీని కబళించేశారు. చివరికి తండ్రికి పొలిటికల్ లైఫ్ ఇచ్చిన పార్టీని నిలబెట్టేందుకు ఇప్పుడు వైఎస్ షర్మిల కాంగ్రెస్ పగ్గాలు చేపట్టారు. షర్మిల రాకతో రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఒక ఊపు వస్తే.. జిల్లాలో మాత్రం ఎనలేని క్రేజ్ వచ్చిందని చెప్పవచ్చు.

కాంగ్రెస్ పార్టీతో

సీఎం జగన్మోహన్‌రెడ్డి కుటుంబం రాజకీయంగా ఎదిగిందంటే అది కాంగ్రెస్ పార్టీ పెట్టిన భిక్ష అంటారు. రాజశేఖర్‌రెడ్డి కరుడుగట్టిన కాంగ్రెస్ వాది. అందుకే కాంగ్రెస్ పార్టీకి, రాజశేఖర్‌రెడ్డికి ఎనలేని సంబంధం ఉంది. 2004, 09 ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో వైఎస్ సీఎం అయ్యారు. జిల్లాలో అదే స్థాయిలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు గెలుచుకుంది. అయితే వైఎస్ మరణం, వైసీపీ స్థాపించడంతో కాంగ్రెస్ క్యాడరంతా జగన్ వెంట నడిచింది.

తెరపైకి వైఎస్ సౌభాగ్యమ్మ

దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి మరణం, వివేకానందరెడ్డి హత్య.. అప్పటి వరకూ ఒక్కటిగా ఉన్న వైఎస్ కుటుంబం చీలిందంటారు. సీఎం జగన్ సోదరి, ప్రస్తుత పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన చిన్నాన్న దారుణ హత్యను జీర్ణించుకోలేక పోయారంటారు. సీబీఐ విచారణలో ఆమె వాంగ్మూలం ఇచ్చారని చెబుతారు. కాంగ్రెస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత సొంత కుటుంబంలో షర్మిల తనకు, సునీతకు జరిగిన అన్యాయాన్ని రాజకీయంగా ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారని అంటున్నారు. అందుకే కడప పార్లమెంటు లేదా, పులివెందుల అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున దివంగత వైఎస్ వివేకానందరెడ్డి సతీమణి సౌభాగ్యమ్మను పోటీలో నిలిపే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన కార్యకర్తలకు షర్మిల పార్టీ ఉద్దేశ్యమేందో చెప్పుకొచ్చారు. జగన్ బీజేపీతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారంటూ పలుమార్లు ప్రస్తావించారు. దీన్ని బట్టి చూస్తే ముస్లిం మైనార్టీలకు, క్రైస్తవులకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్న విషయాన్ని షర్మిల స్పష్టం చేశారని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో కడప లేదా పులివెందుల నుంచి తమ చిన్నమ్మ సౌభాగ్యమ్మను కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దింపి ఎంపీ అవినాశ్‌రెడ్డి లేదా వైసీపీ నుంచి ఇతరులు ఎవరు పోటీ చేసినా ఓడించాలని కసితో ఉన్నట్లు చెబుతున్నారు. మొత్తానికి షర్మిల జిల్లా టూరు కాంగ్రెస్‌లో ఒక ఊపు తెచ్చిందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

వివేకా హత్యతో..

పులివెందుల అనగానే అందరికీ వైఎస్ కుటుంబమే గుర్తుకు వస్తుంది. బయటి జనాలంతా కూడా కడప జిల్లా అంటే రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి అడ్డా అనుకునే వారు. అందుకు తగ్గట్లుగానే ఎన్నికల్లో వైఎస్ కుటుం బాన్ని ఆశీర్వదిస్తూ వచ్చారు. 2019 మార్చి 15న మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి పులివెందులలోని తన ఇంటిలోనే దారుణహత్యకు గురయ్యారు. అప్పట్లో ఈ హత్యను వైసీపీ వారు టీడీపీ పైకి నెట్టేశారు. నిజం నిప్పులాంటిది అన్నట్లు సీబీఐ విచారణలో వివేకా హత్యకు సంబంధించి స్క్రిప్ట్, కథ, నటులు అంతా ఎవరో తెలిసిపోయింది. వివేకా నందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డి ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. వీరిలో ఎంపీ తప్ప మిగిలిన వారు రిమాండులో ఉన్నారు. వీరంతా సీఎం జగన్ శిబిరానికి అత్యంత ముఖ్యులని చెబుతారు. వివేకా చనిపోగానే.. గుండెపోటు, రక్తపు వాంతులు అంటూ ఈ ముఖ్యుల ఆధ్వర్యంలోనే మొదట ప్రచారం జరిగిందని సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొంది. వివేకానందరెడ్డిని గౌతమ బుద్ధుడు అంటారని దివంగత వైఎస్ రాజశేర్‌రెడ్డే చెప్పేవారు. అయనను పార్టీ రహితంగా అం దరూ ప్రేమించేవారు. వివేకా ఎంపీగా ఉన్నా, మంత్రిగా ఉన్నా.. సోదరుడు రాజశేఖర్‌రెడ్డి సీఎం అయినా సరే.. వివేకా చాలా సాదాసీదాగా ఉండేవారని అంటారు. అలాంటి వ్యక్తిని దారుణంగా సొంతవాళ్లే మర్డరు చేయ డాన్ని ఆయన కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోయారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

సిద్దవటం, జనవరి 30 : మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామానికి చెందిన రెడ్డయ్య అనే వ్యక్తి భాకరాపేట వద్ద రైలు కింద పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. శరీరం రెండు ముక్కలు కావడంతో మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. మృతికి సంబంధించిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

రంగసముద్రంలో చోరీ

3.70 లక్షల విలువైన బంగారు, వెండి, నగదు, బైక్ అపహరణ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

పోరుమామిళ్ల, జనవరి 30 : పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం గ్రామంలో చరణ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి సుమారు రూ.3.70 లక్షల విలువైన బంగారు, వెండి నగలు నగదు, మోటారు బైక్‌ను తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. చరణ్‌రెడ్డి మైదుకూరు రోడ్డులో డాబాలో ఉన్నాడని డాబా మూసిన తరువాత ఇంటికి వెళ్లి చూడగా తన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు సీఐ చిరంజీవి, ఎస్ఐ సంఘటాస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హిజ్రాపై దాడి కేసులో ముగ్గురి అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ చిరంజీవి

పోరుమామిళ్ల, జనవరి 30 : సాదిక్ ఆలియాస్ సన అనే హిజ్రాపై దాడి చేసి గాయపరిచిన కేసులో రెడ్డివారిపల్లెకు చెందిన మలతాటి రవి, వరికుంట్లకు చెందని నిఖిల్, మహబూబ్‌నగర్‌కు చెందిన గోపిక్రిష్ణ ఆలియాస్ గోపికలను అరెస్టు చేసి కోర్టుకు పంపినట్లు సీఐ చిరంజీవి తెలిపారు. ఈనెల 25న సన అనే హిజ్రాపై దాడి చేసి గాయపరిచిన విషయం విదితమే. ఈ కేసులో సీఐ చిరంజీవి పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఆ ముగ్గురిని అరెస్టు చేసి మంగళవారం బద్వేలు కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

అక్రమ మద్యంపై పోలీసుల మెరుపుదాడులు


పట్టుబడిన వ్యక్తితో పాటు మద్యం బాటిళ్లు

కడప (క్రైం), జనవరి 30 : నగర పరిధిలోని రైల్వేస్టేషన్ వద్ద రైల్వే పోలీసులు సోదాలు నిర్వహిస్తుండగా చెన్నై నుంచి పూణె వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ వ్యక్తి బ్యాగ్‌లో ఉన్న మద్యం బాటిళ్లను సీజ్ చేసి ఆ వ్యక్తిని అరెస్టు చేసినట్లు రైల్వే ఇన్‌స్పెక్టరు నాగార్జున తెలిపారు. ఆయన వివరాల మేరకు... గుంతకల్లు డివిజన్ ఎస్ఆర్‌పీ చౌడేశ్వరిదేవి, తిరుపతి డీఎస్ఆర్‌పీ షేక్షా ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు. చెన్నై నుంచి పూణె వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ వ్యక్తి వద్ద బ్యాగులో 22 మద్యం బాటిళ్లను తీసుకెళుతుండగా పట్టుకుని సీజ్ చేయడంతో పాటు ఆ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెపాఆరు. దాడిలో పాల్గొన్న సిబ్బందిని ఎస్ఆర్‌పీ, డీఎస్ఆర్‌పీలు అభినందించడం జరిగిందని ఆయన తెలిపారు.

సంబేపల్లెలో 40 మద్యం బాటిళ్లు స్వాధీనం


మద్యం బాటిళ్లు, వ్యక్తితో పోలీసు సిబ్బంది

సంబేపల్లె, జనవరి 30: మండల పరిధిలోని శెట్టిపల్లెకు చెందిన షఫీ మంగళవారం అక్రమ మద్యం అమ్ముతూ పట్టుబడినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అతని వద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా అక్రమ మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాజకీయ లబ్ధి కోసం బీజేపీ ప్రయత్నం

- **భూ కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలి**
- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

రాయచోటిటౌన్, జనవరి 30: దేశంలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ పేరుతో ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వ రయ్య విమర్శించారు. సోమవారం ఆయన రాయచోటి పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి రావడానికి బీజేపీ ప్రభుత్వం తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తోందన్నారు. రాజ్యాంగబద్ధంగా నడవాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్, సీబీఐ, సీఐడీ లాంటి వాటిని కూడా వాడుకుని విపక్షాలపైన దాడులు చేయించి వారిని లొంగదీసుకోవడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీలపైన, ప్రశ్నించిన వారిపై వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడే నీచమైన రాజకీయాలకు రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ మానుకోవాలని, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని కోరారు. సస్పెండ్ అయిన కలెక్టర్ గిరీషా జిల్లాలో, రాయచోటి పరిసర ప్రాంతాల్లో భూకేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, రాధాకృష్ణ, విశ్వనాథ్‌నాయక్, శ్రీనివాసులు, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఉదయగిరి రూరల్, జనవరి 30: నెల్లూరు జిల్లా ఉదయగిరి పట్టణంలోని ఓ లాడ్జీలో మంగళవారం యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు, అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కంబాలకుంట గ్రామానికి చెందిన సింగనమల వెంకటేశ్ (23)కు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో ఉదయగిరి చాకలవీధిలోని తన అక్క సైదాపురం నాగమణి వద్దకు వచ్చి ఉంటున్నాడు. ఐదేళ్లుగా మర్రిపాడు మండలం రామానాయుడుపల్లికి చెందిన మేస్త్రీ చీమలదిన్నె రమణయ్య వెంట తెలంగాణలో బేల్దారీ పనులకు వెళుతుండేవాడు. ఈ క్రమంలో వెంకటేశ్ సంక్రాంతికి మేస్త్రీతో పాటు ఉదయగిరికి వచ్చాడు. ఈనెల 14న రమణయ్య లాడ్జీలో ఓ గదిని అద్దెకు తీసుకుని తెలంగాణకు కూలీలను తీసుకెళ్లేందుకు గ్రామాల్లో తిరుగుతున్నాడు. నాలుగు రోజుల క్రితం తన అక్క ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంకటేశ్ మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఈ విషయం మేస్త్రీకి తెలపడంతో మళ్లీ ఎక్కడికైనా వెళ్లిపోతాడేమోనని గ్రహించి మేస్త్రీ, నాగమణి కుమారుడు కలిసి వెంకటేశ్‌ను తీసుకువచ్చి లాడ్జీలో ఉంచి బయట తాళం వేసి, టీ తాగేందుకు వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉండడాన్ని గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వేల్పుల గిరిబాబు తన సిబ్బందితో లాడ్జికి చేరుకుని తలుపులను ధ్వంసం చేసి మృతదేహాన్ని కిందకు దింపి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

నరక దారి...!

- **నిత్యం ప్రమాదాలే.. అయినా పట్టించుకోరు**
- **అనుమతులు లేక ఆగిన రోడ్డు పనులు**
- **వాహనదారులకు తప్పని తిప్పలు**
- **రాయచోటి-పింఛా రోడ్డు దుస్థితి**



సుండుపల్లె, జనవరి 30: ఆ దారిలో ప్రయాణించాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. అది నరకానికి ప్రధాన రహదారిగా మారింది. నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. పింఛా నుంచి రాయచోటికి వెళ్లే ప్రధాన రహదారి వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. సుండుపల్లె మండల ప్రజలకు ఉన్న ప్రధాన సమస్యల్లో మొదటిది డబుల్ రోడ్డు సమస్య. రాయచోటి నుంచి సుండుపల్లె, రాయవరం, పింఛా ప్రాంతాలకు నిత్యం అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రజలు ప్రయాణం చేసే ఈ రోడ్డులో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు ఇంత దారుణంగా ఉన్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. రాయచోటి నుంచి కొంతమేరకు జీకే రాచపల్లె వరకు డబుల్ రోడ్డుకు అనుమతులు వచ్చాయి. కొంతవరకు పనులు జరిగాయి. అటవీ మార్గంలో అనుంపల్లె నుంచి రాచంవాండ్లపల్లె వరకు రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా గుంతలమయంగా మారింది. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురి కావడంతో ద్విచక్ర వాహనదారులు పక్కకు దిగాలంటే భయపడిపోతున్నారు. ఇక్కడ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం రాయవరంకు చెందిన షాజహాన్ అనే వ్యక్తి రాయచోటిలో నివాసం ఉంటూ తన స్వగ్రామమైన రాయవరం వెళ్లి తిరిగి రాయచోటికి వెళుతూ ప్రమాదానికి గురై తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురై గాయాలు కావడంతో పాటు మృతి చెందిన వారు ఉన్నారు. అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు పనులు ప్రారంభించాలని లేకుంటే రోడ్డు పక్కన మట్టి తోలి తాత్కాలిక రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అటవీ ప్రాంతంలో అనుమతులు లేక...

రూ.35 కోట్ల నిధులతో రాయచోటి సమీపంలోని సద్దికూళ్లవంక నుంచి సుండుపల్లె మండలంలోని జీకే రాచపల్లె వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. 20 కిలోమీటర్లు డబుల్ రోడ్డుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చి పనులు జరుగుతున్నాయి. అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడం వలన అనుంపల్లె అడవిలో పనులు జరగడం లేదు. పనులు ఆగిపోవడం వలన రోడ్డు గుంతలమయంగా మారి గతంలో కురిసిన వర్షాల కారణంగా రోడ్డుకు ఇరువైపులా రోడ్డు కోతకు గురి కావడం గుంతలు పడడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా కనీసం మట్టిని తీసి గుంతల్లో వేసేందుకు సైతం అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు వాపోతున్నారు.

అనుమతి రాగానే పనులు పూర్తి చేస్తాం

- గిరీశ్వర్‌రావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు చేసేందుకు అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అనుమతులు రాగానే పనులు పూర్తి చేస్తాం. అటవీ ప్రాంతంలో గుంతల్లో మట్టి వేయాలన్నా అటవీశాఖ అధికారులు వేయనివ్వడం లేదు. అనుమతులు వచ్చేంతవరకు చేసేదానికి లేదంటున్నారు. అనుమతులు కోసం ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. త్వరితగతిన పనులు పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేస్తాము.

పింఛా వరకు డబుల్ రోడ్డు వేయాలి



పింఛా నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఎప్పుడో వేసిన రోడ్డు గుంతలమయంగా మారింది. పింఛా రోడ్డులో సుమారు 80 పల్లెలకు చెందిన ప్రజలు అనేక అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి వెళుతుంటారు. గుంతలమయంగా మారిన రోడ్డులో ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయపడుతున్నారు. రోడ్డు సరిగ్గా లేకపోవడం వలన సమయానికి బస్సులు, ఆటోలు కూడా రావు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినీ, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పింఛా వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలి.

- సుధాకర్, పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కొడుకులను కోల్పోయాను



మడితాడు సమీపంలో మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నా ఇద్దరు కొడుకులను కోల్పోయాను. రాయవరం నుంచి సుండుపల్లెకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మడితాడు సమీపంలో ప్రమాదకరమైన మలుపు ఉంది. అక్కడ ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకేసారి ఇద్దరు కుమారులు చనిపోయారు. మా కుటుంబం రోడ్డు పాలైంది. సరైన రోడ్డు వసతి ఉండి ఉంటే ఇంత ప్రమాదం జరిగేది కాదు. నాలాగే ఇంకెంతమంది కుటుంబాలు ఈ రోడ్డు బారిన పడి అయినవారిని కోల్పోయారో. వెంటనే అధికారులు స్పందించి రాయవరానికి డబుల్ రోడ్డు మంజూరు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

-ఫహరున్, రాయవరం

బాలాయపల్లెలో సచివాలయాన్ని ప్రారంభించిన కలెక్టరు


మాట్లాడుతున్న కలెక్టరు విజయరామరాజు

బద్వేలు రూరల్, జనవరి 30 : మండల పరిధిలోని బాలాయపల్లెలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని కలెక్టరు విజయరామరాజు, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రతి లబ్ధిదారుడు నేరుగా ప్రభుత్వం వద్ద నుంచి లభించే అన్ని సదుపాయాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రమణారెడ్డి, జడ్పీటీసీ పోలిరెడ్డి, ఎంపీపీ రమణమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, డీఈ నాగరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

బద్వేలు రూరల్, జనవరి 30 : మండల పరిధిలోని తిరువెంగళాపురం గ్రామ సమీపంలోని ముళ్ల పొదల్లో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై రవికుమార్ తెలిపారు.

వ్యాధుల అధ్యయనంపై వైవీయూలో సదస్సు

- **బ్రోచర్ విడుదల చేసిన వీసీ చింతా సుధాకర్**


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వైస్‌ఛాన్సలర్, ప్రిన్సిపాల్, తదితరులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 30 : వైవీయూ జంతుశాస్త్ర శాఖ ఫిబ్రవరి 6, 7 తేదీల్లో మానవ వ్యాధుల అధ్యయనం కోసం జంతు నమూనాలు నైతిక విలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు అనే అంశంపై నిర్వహించే సెమినార్ ప్రయోజనకరమని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. మంగళవారం తన ఛాంబరులో సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జంతు నమూనాలు, వైద్య పరిశోధనల, ఔషధ అభివృద్ధి చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. అలాగే మానవుడిలో వ్యాధుల గుర్తింపునకు సహాయపడతాయన్నారు. ప్రతియేటా ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల కొద్దీ జంతువులపై ప్రయోగాలు చేస్తున్నారని, ఆ సమయంలో జంతువులు అనుభవించే నొప్పి, బాధ మరణం చర్చనీయాంశంగా మారిందన్నారు. పరిశోధనల్లో ప్రత్యామ్నాయ పద్ధతులను వినియోగించే విషయమై నిపుణులు ప్రసంగిస్తారని చెప్పారు. కార్యక్రమంలో దూర విద్య సంచాలకులు ప్రొఫెసర్ కె.క్రిష్ణారెడ్డి, ఉప సంచాలకులు శ్రీధర్‌బాబు, సెమినార్ నిర్వహణ సంఘ సభ్యులు ఎస్.వెంకటరమణ, అనుప్రసన్న, వెంకటరమణారెడ్డి, మరియదాస్, మనస్వి పాల్గొన్నారు.

పుట్టా సమక్షంలో 150 కుటుంబాలు టీడీపీలో చేరిక


సమావేశంలో మాట్లాడుతున్న పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, జనవరి 30 : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో వైసీపీ నుంచి 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మంగళవారం మండలంలోని రేకలకుంట్ల పంచాయతీలోని బోగాదిపల్లె, చీకటివారిపల్లె, గొల్లపల్లె గ్రామాల్లోని ప్రజలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో వైసీపీ నుంచి నల్లబాపినేని ఓబయ్య, ప్రతాప్, గంగినాయుడు, బాలయ్య, వంకర సుబ్బయ్య, సుబ్రమణ్యం, ప్రతాప్, వెంకటేశ్, రామసుబ్బయ్య, సుబ్రమణ్యంతో పాటు మూడు గ్రామాల్లోని అనుచరులు 150 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు, సీనియర్ నాయకుడు రామచంద్రనాయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వివేకానందరెడ్డి, ఎం.రామచంద్రనాయుడు, పుట్టా ప్రభాకర్‌యాదవ్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు వెంకటేశ్‌నాయుడు, ముద్దుక్రిష్ణమనాయుడు, సర్పంచ్ నారాయణ, అంకిరెడ్డిపల్లె రామసుబ్బారెడ్డి, బీమానాయుడు, రమేష్, వెంకటేశ్‌నాయుడు, కొండా ఓబయ్య, మాజీ ఎంపీపీ సుబ్బారావు, భూతప్ప నాయుడు, శీలం నరసింహులు, నాగచంద్రుడు, జయరామిరెడ్డి, శివ, మిల్లుశ్రీను, అన్నవరం సుధాకర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతదేహానికి చీమలు పట్టినా పట్టించుకోరా...

- **ఆస్పత్రి ఎదుట మృతురాలి బంధువుల బైఠాయింపు**
- **సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్**


ఆసుపత్రి వద్ద గుంపులుగా చేరిన మృతురాలి బంధువులు


ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జనవరి 30 : జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందని బాధితులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే... జమ్మలమడుగు బీసీ కాలనీకి చెందిన చేనేత కార్మికురాలు బడిగింజల దేవి (16) అనే బాలిక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. సోమవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మార్చురీకి తరలించారు. విచారణ పేరుతో పోలీసులు సాయంత్రం వరకు మృతదేహాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రభుత్వ వైద్యులుగానీ సిబ్బందిగానీ మృతదేహాన్ని ఫ్రీజర్‌లో పెట్టకుండా అలాగే వదిలేశారు. మంగళవారం ఉదయం 9 గంటలకు బాధితురాలి బంధువులు, కుటుంబసభ్యులు ఆసుపత్రి మార్చురీ వద్దకు చేరుకున్నారు. మార్చురీలో బాలిక మృతదేహానికి చీమలు పట్టి ఉండటం గమనించిన కుటుంబసభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతదేహం ఫ్రీజర్‌లో పెట్టకుండా ఇలా రోజంతా నిర్లక్ష్యంగా వదిలేయడంపై ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించారు. వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని తెలపడంతో నిరసనగా ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. పోస్టుమార్టం సిబ్బంది పట్టించుకోలేదని ఆరోపించారు. బాధ్యులైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్‌బాషాకు రాతపూర్వకంగా ఫిర్యాదుచేశారు. ఇందుకు ఆయన స్పందిస్తూ పోస్టుమార్టం వద్ద నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సీపీఎస్, పీఆర్సీపై రాజకీయ పార్టీలు తమ వైఖరి వెల్లడించాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 30 : రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు అత్యంత కీలకమైన సీపీఎస్, పీఆర్సీ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని తెలియజేయాలని ఏపీటీఎఫ్ నాయకులు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, అలీఖాన్, ఈశ్వర్‌చంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ అమరావతి ధ్యేయమని సీపీఎస్ రద్దుకై 2007లోనే ఉద్యమాన్ని ప్రారంభించామని గుర్తు చేశారు. కొంతమంది స్వార్థపరులవల్ల ఇప్పటి వరకు సీపీఎస్ రద్దు కాలేదన్నారు. 2023 జూలై నుంచి11వ పీఆర్సీ అమలు కావాల్సి ఉందని దీనిపై ఐఆర్, ఫిట్‌మెంట్ ఫార్ములాపై రాజకీయ పార్టీలు తమ విధాన ప్రకటనలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ సెటిల్ కాని పీఆర్సీ, డీఏ బకాయిలు ఉద్యోగుల పొదుపుపై వడ్డీ రేట్లు, భద్రతపై స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పని చేసిన వారికి తగిన గుర్తింపు



నియామకపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

వేంపల్లె, జనవరి 30: తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, కడప పార్లమెంట్ అధ్యక్షుడు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మైనార్టీ మండల కార్యదర్శిగా ఫయాజ్, బీసీ విభాగం మండల ఉపాధ్యక్షుడుగా మడకా శ్రీనివాసులకు మంగళవారం నియామక పత్రాలు అందించారు. రాబోవు రోజుల్లో మరింత ఉత్సాహంగా పనిచేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, ఉపాధ్యక్షుడు భద్ర, వేమకుమార్, మండల మాజీ కార్యదర్శి పాపిరెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు వల్లి, డాక్టర్ కరీముల్లా, గోగుల మల్లి, మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పీగా చెరుకూరి శ్రీను

వేంపల్లె, జనవరి 30: సర్వశిక్ష అభియాన్ ఎస్ఆర్‌పీగా వేంపల్లెకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు చెరుకూరి శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. లిప్ మానిటరింగ్ కార్యక్రమం ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నారు.

త్యాగరాజ ఆరాధన



త్యాగరాజస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

చెన్నూరు, జనవరి 30 : నాదోపాసనతో భగవంతుడి అనుగ్రహం పొందిన మహనీయుడు త్యాగరాజు అని చెన్నూరు నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పేరుసోముల మునెయ్య అన్నారు. సరస్వతీ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి త్యాగరాజస్వామి ఆరాధన నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు బా లాజీ, పూజారి, వెంకటరత్నం, ప్రసాద్, కిరణ్, శివగంగా ధర్, శ్రీను, రామసుధీర్, బాలశివ, మారుతీ సురేష్ పాల్గొన్నారు.

నేడు గోటూరులో 'బాబు ష్యూరిటీ'

వల్లూరు, జనవరి 30 : మండల పరిధిలోని గోటూరు గ్రామంలో నేటి మధ్యాహ్నం 3 గంటలకు కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

పాడి రైతులు సలహాలు పాటించాలి

ఖాజీపేట, జనవరి 30 : పాడి రైతులు వైద్యుల సలహాలు తప్పక పాటించాలని పశు అభివృద్ధి సంస్థ అదనపు సంచాలకులు డాక్టర్ రంజనీకుమారి అన్నారు. మంగళవారం మండల పరిధిలో త్రిపురవరం గ్రామంలో కృత్రిమ గర్భధారణతో జన్మించిన పెయ్యదూడలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగ నిర్ధారణ వర్తం ద్వారా 90 శాతం పెయ్య దూడలు జన్మిస్తాయని తెలిపారు. పశువైద్యాధికారులు రమేష్, శివరామిరెడ్డి, ఎస్.బాబు, రామచంద్ర పాల్గొన్నారు.

జాతిపిత గాంధీజీ సేవలు చిరస్మరణీయం



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి తదితరులు



చెన్నూరులో: నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు

కడప(ఎర్రముక్కపల్లె), జనవరి 30: మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని టీడీపీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ని వాళులర్పించారు. జింకా శ్రీను, ఓబుల్‌రెడ్డి, ఇలియాస్, నాసర్ ఆలీ, కరీముల్లా గంగిరెడ్డి పాల్గొన్నారు. కడప నగరంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జి మాధవీరెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

చెన్నూరు: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రఘురామిరెడ్డి, కార్యదర్శులు శివ, టీఎన్‌చంద్రరెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె: ట్రిపుల్ ఐటీలో డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. వాసవి కల్యాణ మండపంలో ఆవోపా ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆవోపా అధ్యక్షుడు సునీల్, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధ్వర్యంలో కోఆర్డినేటర్ రహంతుల్లా, దాదాపీర్‌లు నివాళు లు అర్పించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ యోగాంజనేయులు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

పులివెందుల రూరల్: పులివెందుల మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడండి



పులివెందులలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బీటెక్ రవి

పులివెందుల టౌన్, జనవరి 30: సంక్షేమ పథకాల పేరుతో కల్లోలం సృష్టిస్తున్న వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి పిలుపునిచ్చారు. వైసీపీ కక్షపూరిత రాజకీయాలతో రాష్ట్రాభివృద్ధి ముందుకు కదల్లేదని ఆరోపించారు. మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని సుజాత హాల్, రజక కాలనీ, చిన్నకొండారెడ్డి కాలనీ, వాసవి కాలనీ, జయమ్మ కాలనీలలో పర్యటించారు. బీటెక్ రవితో పాటు ఆయన సతీమణి లతారెడ్డి ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. గతంలో చంద్రబాబు హయాంలో చేసిన అభివృద్ధిని గుర్తుచేశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందులలో రోజురోజుకు తెలుగుదేశంపార్టీకి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో టీడీపీకి ఆదరణ పెరుగుతుండడంతో జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు తమపై బురద జల్లడమే ధ్యేయంగా పెట్టుకొన్నారన్నారు. టీడీపీలో చేరిన వారిని భయపెట్టి, భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారని, దీని కారణంగానే టీడీపీలో చేరుతున్నారన్నారు. ముందుముందు మరిన్ని చేరికలు ఉంటాయని, బయటకు కనిపించని వారు కూడా టీడీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. భవిష్యత్తు టీడీపీదే అని సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లలా భావించి పాలన అందించే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు

కడప (ఎడ్యుకేషన్) : వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే సమయంలో ఆసన్నమైందని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరం 27వ డివిజన్ దేవుని కడప రోడ్డు అమీర్ హాలు నుంచి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత అధికమైందన్నారు. కడప నగరంలో రోడ్లు అస్తవ్యస్తంగా చేసి ప్రజలకు ఇబ్బందులపాలు చేస్తున్నారని ఆరోపించారు. చిరు వ్యాపారులు కూడా వ్యాపారం చేసుకునే పరిస్థితి లేదని తెలిపారు. అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకివచ్చాక నగరాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ, నాయకులు రహ్మతుల్లా, శివ,కుమార్, బాషాతో పాటు పలువురు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంప పెట్టు



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 30 :సుప్రీంకోర్టు తీర్పులు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంప పెట్టు అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ అన్నారు. మంగళవారం కడప నగరంలోని హరితవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు సభలు జనంతో కళకళలాడుతుంటే జగన్ సభలు వెలవెలబోతున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో ఏ వర్గానికి కూడా మేలు జరగలేదన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల్లో ఏపీ దేశంలో ఆరవ స్థానంలో ఉందని ప్రతిరోజూ కనీసం 70 కేసులు నమోదవుతున్నాయన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ రైతులపై రుణభారం ఎక్కువగా ఉందన్నారు. నిరుద్యోగంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని, ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. ఇప్పటికే రాష్ట్రం 13 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో జగన్‌రెడ్డికి కోర్టులో ఎదురుదెబ్బలతోపాటు, సుప్రీంకోర్టు వ్యాఖ్యలకు వైసీపీ నాయకులు సిగ్గు పడాలన్నారు. నిజం గెలవడానికి ఆలస్యం కావచ్చు కానీ కచ్చితంగా గెలుస్తుందన్నారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ప్రజలు జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని ఇప్పటికే ఆయనకు అర్థమైందన్నారు .ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, అమీర్‌బాషా, పీరయ్య, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్: చంద్రబాబునాయుడుపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన కేసులు తప్పుడు కేసులని సుప్రీంకోర్టు తీర్పుతో రుజువైందని జిల్లా అధికార ప్రతినిధి అశోక్, కార్యనిర్వాహక కార్యదర్శి నాగిరెడ్డి, సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, యువనాయకులు అమర్. మంగళ వారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో వైసీపీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. ఎన్ని కుట్రలు చేసిన రాష్ట్ర ప్రజలు చంద్రబాబు వెంటే ఉన్నారన్నారు.

బీజేపీ, వైసీపీలను గద్దె దించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గాలిచంద్ర

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 30 : ప్రజా కంటకంగా మారిన బీజేపీ, వైసీపీలను గద్దె దించాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం నల్లధనం వెలికితీత, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల కల్పన వంటి హామీలను మంటగలిపిందన్నారు. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదాల ఆర్భాటాలే తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. కేవలం మోదీ హయాంలోనే వంద లక్షల కోట్ల అప్పులు తెచ్చి దేశాన్ని అప్పుల భారత్‌గా మార్చారని దుయ్యబట్టారు. నల్లచట్టాలు తీసుకువచ్చి రైతాంగ ఆగ్రహాన్ని చవిచూసిందన్నారు. నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోలు, డీజలు ధరలు ఇష్టానుసారంగా పెంచి ప్రజల నడ్డివిరిచారన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం ల్యాండ్, శాండ్, మైనింగ్, లిక్కర్ మాఫియా ద్వారా కోట్లాది రూపాయలను దోచుకుందన్నారు. విద్యుత్, ఆర్టీసీ, ఇంటి, నీటి, చెత్త పన్నులను ఇబ్బడిముబ్బడిగా పెంచి జనం ముక్కుపిండి వసూలు చేస్తోందన్నారు. 11 లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. అప్పు చేసి పప్పుకూడులా రాష్ట్రంలో పాలన సాగిస్తుందన్నారు. పట్టణాలకు దూరంగా నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఉన్న జగనన్న కాలనీల్లో అవినీతికి అంతేలేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు నెలనెలా 1వ తేదీన జీతాలు ఇవ్వలేని దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, బషీరున్నీసా, సుబ్బారెడ్డి, సుబ్రమణ్యం, వెంకటశివ, పి.సుబ్బరాయుడు, వీరశేఖర్, కేసీ బాదుల్లా, మద్దిలేటి, సురేష్, వెంకట్రామ్, శివరాం, మునెయ్య, బ్రహ్మం,మస్తాన్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల ఆదేశం.. ఆర్పీల అత్యుత్సాహం

● ఆసరా చెక్కుల పంపిణీలో తాగడానికి నీరు.. కూర్చోడానికి కుర్చీలు లేక మహిళల ఇక్కట్లు ● గేటు మూసివేసి సిబ్బంది దాష్టీకం



గేట్లు మూసివేసి డ్వాక్రా మహిళలను నిర్బంధిస్తున్న ఆర్పీలు

కడప (చిన్నచౌకు), జనవరి 30 : స్థానిక మున్సిపల్ గ్రౌండ్ సమీపంలోని స్కౌట్ హాలులో మంగళవారం నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత కార్యక్రమానికి డ్వాక్రా మహిళలను పెద్ద ఎత్తున తరలించారు. కూర్చోనడానికి కుర్చీలు, కనీస వసతులు లేక పోవడంతో ఎండ తీవ్రత తట్టుకోలేక మహిళలు ఇంటి బాట పట్టారు. దీంతో వారిని అడ్డుకోవాలని వైసీపీ నాయకులు ఆదేశించడంతో కొంత మంది ఆర్పీలు అత్యుత్సాహంతో గేట్లు మూసివేశారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక డ్వాక్రా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంటికి పంపించండి, దాహం వేస్తోంది అని ఎంత వేడుకున్నా కనికరించకుండా డ్వాక్రా మహిళలపై ఆర్పీలు జులుం ప్రదర్శించారు.

ఖాజీపేట: ఖాజీపేట తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో ఆసరా నాలుగో విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని మహిళా గ్రూపు సభ్యులు కూడా తప్పక హాజరు కావాలని సీసీలు హుకుం జారీ చేశారు. దీంతో వచ్చిన డ్వాక్రా మహిళలకు సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. మహిళలు కూర్చునేందుకు కుర్చీలు లేక కొంత మంది నేలపై మరికొందరు ప్రహరీగోడపై కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొందరు నిలబడలేక వచ్చిన కొద్దిసేపటికే తిరుగు ప్రయాణం పట్టారు. ఏమైనా మహిళలకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని మహిళలు గుసగుసలాడుకోవడం గమనార్హం.

వల్లూరు: మండలంలోని 560 స్వయం సహాయక సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా ద్వారా 5,00,37,174 రూపాయలను ఆర్థిక సాయం అందించినట్లు ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూలులో ఆర్టీసీ ఛైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డితో కలిసి ఇందుకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఎంపీడీవో జయశ్రీ, జడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరారెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్, ఏపీఎం శైలజ తదితర మండల స్థాయి, గ్రామ స్థాయి నాయకులతో పాటు సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సంఘాల అధికారులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు జయప్రదం చేయండి

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప (ఎడ్యుకేషన్), జనవరి 30 : ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలు చెల్లించాలంటూ 31 నుంచి జరిగే రిలే నిరాహారదీక్షలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం కడప నగరం యూటీఎఫ్ కార్యాలయంలో వారు ముఖ్య నాయకుల సమావేశంలో మాటల్లాడుతూ రిలే నిరాహార దీక్షలతో ప్రభుత్వ మొండివైఖరి ఎండగడతామన్నారు. నేటి నుంచి ఫిబ్రవరి 3 వరకు నాలుగు రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ఈ దీక్షల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్, వీర నారాయణ, అబ్దుల్‌గణి, చంద్రశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలి

కడప (మారుతీనగర్) జనవరి 30: ప్రభుత్వ పెన్షన్‌దారులకు సంబంధించిన 2022 పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంబారపు అహరోన్, సి. గంగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎస్. వెంకటేశ్వర్లు చేతులమీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం డైరీని ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడిషనల్ క్వాంటమ్ పెన్షన్, ధరల సూచికల ప్రకారం పెంచాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి నరేంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు సుహాసిని, బాలచౌడన్న, జాయింట్ సెక్రెటరీలు క్రిస్టఫర్, జాన్, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 30 : కడప నగరం 24వ డివిజను రాజారెడ్డివీధిలో మంగళవారం వెంకట అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు భారీ ఎత్తున టీడీపీలో చేరారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జి మాధవీరెడ్డి టీడీపీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మహిళలు యువత కోరుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో యువత ముందుండి అఖండ విజయమే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.మహిళలు తలుచుకుంటే సాధ్యం కానిది ఏమీ లేదన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ఫలాలు అందరికీ అందిస్తామని హామీ ఇచ్చారు. ముందుగా ద్వారకనగర్ నుంచి యువత పెద్దఎత్తున బైకు ర్యాలీ ద్వారా రాజారెడ్డి వీధికి చేరుకుని శ్రీనివాసరెడ్డికి మాధవీరెడ్డిని సత్కరించారు.

'తాయిలాల కోసం కాంగ్రెస్‌లోకి'

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 30: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తాయిలాల కోసమే కాంగ్రెస్‌లో చేరారని కడప నగర మేయర్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేశ్‌బాబు ఆరోపించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ షర్మిల కాంగ్రెస్‌లో చేరడం శోచనీయమన్నారు. నాడు తెలంగాణ ఆడబిడ్డనని అక్కడవారిని నమ్మించి, ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ తాయిలాల కోసం ఆశపడి ఇది నా పుట్టిల్లు అని చెబుతూ సీఎం జగన్‌పై ఆరోపణలు చేయడం తగదన్నారు. అలాగే ఎమ్మెల్సీ రామచంద్రయ్య వైసీపీ విధి విధానాలు నచ్చకపోతే ఎమ్మెల్సీ పదవిని తీసుకోకుండా ఉండాల్సిందని చెప్పారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

కడప (నాగరాజుపేట), జనవరి 30: నగరంలోని ఏఐటీయూసీ కార్యాల యంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డి ప్యూటీ సెక్రటరీ ఉద్దె మద్దిలేటి మం గళవారం సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో జరిగిన యూనియన్ జిల్లా 5వ మహాసభల్లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా గౌరవ అధ్యక్షుడుగా మద్దిలేటి, అధ్యక్షుడుగా రామాంజ నేయులు, ప్రధాన కార్యదర్శిగా లింగన్న, డిప్యూటీ సెక్రటరీగా ఓబన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీరాములు, సంయుక్త అధ్యక్షుడుగా ఓబులేసు, ఉపాధ్యక్షుడుగా రామాంజనేయులు, వీరయ్య, రమేష్, సహాయ కార్యదర్శు లుగా ఈశ్వరయ్య, సుబ్బరాయుడు, వెంకటరమణ, వీరయ్య, కోశాధికారిగా నాగేశ్వర్ రావు, 17 మంది ఆఫీస్ బేరర్స్‌తో పాటు 51 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ఆఫీస్ బేరర్స్ బాలాజీ, నాగేశ్వర్‌రావు, రామాంజనేయులు, బుజ్జి, శ్రీను, మల్లికార్జున, బాలగంగులు పాల్గొన్నారు.

23 మంది ఉద్యోగాలకు ఎంపిక

కడప (నాగరాజుపేట), జనవరి 30 : స్థానిక జిల్లా ఉపాధి కల్పన కార్యాల యంలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు 61 మంది నిరు ద్యోగులు హాజరైనట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలి పారు. వీరికి ఎల్ఐసీ, బైజూస్, యాక్సిస్ బ్యాంకు తదితర కంపెనీల ప్రతి నిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 23 మందిని ఎంపిక చేశారన్నారు. హోదాను బట్టి అయా కంపెనీలు వారికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు.

విగ్రహాలు తొలగించిన తహసీల్దారును సస్పెండ్ చేయాలి

కడప (నాగరాజుపేట), జనవరి 30 : దేవతా విగ్రహాలను తొలగించిన తహసీల్దారును వెంటనే స స్పెండ్ చేయాలని ముస్లిం మైనార్టీ నాయ కుడు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడప నగరంలోని మట్టి పెద్దపులి వద్ద మం గళవారం జనంకోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ కార్యా లయంలో ఆయన మాట్లాడుతూ తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో ఉన్న దేవతా విగ్రహాలను పార్కింగ్ కోసమని చెప్పి తొలగించడం దారుణమన్నారు. దీంతో హిందూ సోదరుల మనోభావాలను గాయపరిచినట్లయిందని తెలిపారు. తహసీల్దారు ముస్లిం, హిందూ మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించడం తగదన్నారు. ఎవరి అండదండల తో ఈ పనులు చేస్తున్నాడని ప్రశ్నించారు. కడప నగరం శాంతికి చిహ్నమన్నారు. ఇక్కడ అన్ని మతాల వారు ప్రేమాభిమానాలతో కలిసి మెలిసి పండుగలు చేసుకుంటామన్నారు. ఇలాంటి నగరంలో ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా తహసీల్దారు ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారు. తక్షణమే కలెక్టరు స్పందించి తహసీల్దారును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు సయ్యద్ అబ్దుల్లా, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి పాటుపడాలి



రహదారి భద్రత ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పులివెందుల టౌన్, జనవరి 30: ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి పాటు పడాలని సీఐ మద్దిలేటి, ఎంవీఐ ప్రసాద్‌లు సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్స వాలను పురస్కరించుకొని మంగళ వారం పట్టణంలో ప్లకార్డులు చేతబట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి పూలంగళ్ల వరకు నినాదాలు చేశారు. ప్రయాణ సమ యంలో పాటించాల్సిన నిబంధనలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ ఆలయంలో ఘనంగా రాహుకాల పూజలు



విజయదుర్గాదేవి అమ్మవారు, రాహుకాల పూజలు చేస్తున్న మహిళలు

కడప (కల్చరల్) జనవరి 30: స్థానిక బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మహిళలు అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన దీపాలను వెలిగించారు.

సోమశిల నిర్వాసితులకు న్యాయం చేయాలి

కడప (మారుతీనగర్) జనవరి 30: సోమశిల ముంపు ప్రాంత బాధితులకు న్యాయం చేయాలని బాధితుడు ముమ్మడి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వాసిత కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం, ఇంటి స్థలం, 5 ఎకరాల మెట్ట, లేదా రెండున్నర ఎకరాల మాగాణి ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయంపై 2019 నుంచి స్పందన కార్యక్రమంలో విన్నవిస్తున్నా ఇంతవరకూ ఫలితం లేదన్నారు. ఎంఆర్‌ఓలు..వీఆర్‌ఓలు మారినపుడల్లా సమస్య తిరిగి మొదటికి వస్తోందని వాపోయారు. కలెక్టర్, కడప ఎంపీ దృష్టికి తీసుకెళ్ళినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముంపు బాధితులకు ప్రస్తుతం వున్న డాక్యుమెంట్ల ప్రకారం సబ్ డివిజన్ చేయాలన్నారు. అందరికీ ఒకేసారి చేయాలనుకుంటే వారందరి డాక్యుమెంట్లన్నీ సేకరించి అంద రికీ ఒకేసారి అందేలా చూడాలన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలపై రేపు ధర్నా



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 30 : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 1న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ టీచర్లకు సర్వీసు రూల్స్ రూపొందించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కొన్నేళ్లుగా డిమాండు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ సౌకర్యం కల్పిం చాలన్నారు. అలాగే మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా ఎంఈవో, ఉప విద్యాశాఖా ధికారులను నియమించాలని కోరారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలను పరి ష్కరించాలని ధర్నా చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, గురయ్య, శ్రీనివాసరెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే అభివృద్ధి, సంక్షేమం




ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, నంద్యాల కొండారెడ్డి, భూపేశ్‌రెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు, జనవరి 30 : తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సమానంగా సాధించగలమని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెన్నానగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకుగ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ ముందస్తు మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, నాగమునిరెడ్డి సాంబశివుడు, షామీర్, గఫార్, బేపారీ గౌస్, ఆరిఫ్, ఆటోబాషా, ఖాసీం, సుబ్బరాయుడు నిజాం, మహబూబ్‌షరీఫ్, పల్లేటి రాముడు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం..: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తలమంచిపట్నం పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, జంబాపురం రమణారెడ్డి, కొండయ్య, సూర్యపెద్దిరాజు, పాపిరెడ్డి, పెద్దసంజీవ, లక్ష్మణ్ నాయుడు, చిన్న సంజీవ, శ్రీనివాసనాయుడు, సాయి, నారాయణస్వామి, చెంగయ్య, ప్రసాద్, లక్షుమయ్య, గంగన్న, వెంకటశివుడు, రాముడు, బాబుల్‌రెడ్డి, రామచంద్రుడు, ఉమానాథ్, గోపాల్ నాయక్, జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: రాష్ట్రంలో తిరిగి చంద్రబాబును అధికారంలోకి తెస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వీరపల్లె పంచాయతీలోని నందిపల్లె, బాలాయపల్లె, వీరపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, ఆదిలక్షుమ్మ పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి తల్లి సరస్వతి మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ రూపొందించిన మినీ మేనిఫెస్టోను ఆమె ఇంటింటికి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.మోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామక్రిష్ణారెడ్డి,నిత్యవర్ధన్‌రెడ్డి,మధుసూదన్‌రెడ్డి,రమణయ్య, బాలగంగిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: వైసీపీ రాక్షసపాలన నుంచి ప్రజలు విముక్తినికోరుకుంటున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శ్రీనివాస నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితారెడ్డి, వార్డు ఇన్‌చార్జులు మస్తాన్‌గోలే, కోగటం నాయబ్, కరీముల్లా ,గఫార్, నూర్, తాటీ శ్రీను , ఆవుల దస్తగిరి పాల్గొన్నారు.




బద్వేలు, ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజా సమస్యలపై అధికారులు స్పందించండి

రాజుపాలెం, జనవరి 30 : రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యపై అధిక ప్రాధాన్యతనివ్వాలని రాజుపాలెం మండల అధ్యక్షుడు వెలివలి నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ సభాభవనంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు కూడా రైతులకు ఉపయోగపడే విధంగా అనుసంధానం చేసి పనులు కల్పించాలన్నారు. ఎంపీడీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో రాజుపాలెం మండల క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచారన్నారు. వారికి తగిన ప్రోత్సాహాలను వారి అకౌంట్లలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శివరామక్రిష్ణారెడ్డి,తహసీల్దారు ఇంద్రాణి, మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ కలిసికట్టుగా పనిచేయాలి-భూపేశ్

ఎర్రగుంట్ల, జనవరి 30: ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు, నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని జమ్మలమడుగు నియోజ కవర్గం టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాబోయే రెండు నెలలు ఎంతో ముఖ్యమైనవన్నారు. వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. అస్వస్థతకు గురైన నాయకులు నాగరాజు, కరీముల్లాను పరామర్శించారు. మండలంలో విస్తృతంగా పర్యటించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి గ్రామోత్సవం



త్యాగరాజస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 30 : మండల పరిధిలోని కానపల్లెలో త్యాగరాజ స్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం కానపల్లె నాయీబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఆంజనేయస్వామి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు స్వామివారికి కాయకర్పూరం సమర్పించారు. త్యాగరస్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని నాయీబ్రాహ్మణులు సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డిని కోరారు.

మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలం



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 30 : అమృతానగర్‌లోని పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాములమ్మ, ఫాతిమ, హసీనా, లత, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవాన్ని మోసుకెళుతున్న సభ్యులు

బ్రహ్మంగారిమఠం, జనవరి 30 : మండలంలోని ఎద్దులాయపల్లె గ్రామ శివారులో ఉన్న శివాలయంలో సుబ్బారెడ్డి (80) అనే అనాథ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న వివేకానంద ఫౌండేషన్ సంస్థ సభ్యులు శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. పులివెందుల ప్రాంతానికి చెందిన సుబ్బారెడ్డి కొన్నేళ్లుగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ భిక్షాటన చేసుకుంటూ జీవించేవాడని, రెండురోజుల క్రితం ఎద్దులాయపల్లె శివాలయానికి చేరుకున్నాడని, సోమవారం రాత్రి అనారోగ్యంతో మరణించాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం శ వాన్ని పంచనామా నిర్వహించిన అనంతరం పోలీసులు వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు రామక్రిష్ణారెడ్డికి అప్పగించారు. కాశినాయన మండలంలోని ఓబులాపురం సమీపంలో ఉన్న వివేకానంద సేవా శ్రమం వద్దకు తీసుకెళ్లి సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వెంకటసురేష్, సుంకే వెంకటేశ్వర్లు, చిన్ని, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

పాడి రైతులు వైద్యుల సలహాలు పాటించాలి

ఖాజీపేట, జనవరి 30 : పాడి పశువులను పెంచే రైతులు వైద్యుల సలహాలు తప్పక పాటించాలని పశు అభివృద్ధి సంస్థ అదనపు సంచాలకుడు డాక్టర్ రంజనీకుమారి అన్నారు. మంగళవారం మండల పరిధిలో త్రిపురవరం గ్రామంలో లింగ నిర్ధారణ ద్వారా జన్మించిన పెయ్యదూడలను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రమేష్, శివరామిరెడ్డి, ఎస్.బాబు, రామచంద్ర, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దూడలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

ఎండలో మాడిపోవాల్సిందేనా..?

కుర్చీలు, నీడలేక ఆసరా మహిళల అవస్థలు



కుర్చీలు లేక నేలపైనే ఎండలో కూర్చున్న మహిళలు



ఖాజీపేట, జనవరి 30 : ఖాజీపేట తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఆసరా నాలుగో విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని మహిళా గ్రూపు సభ్యులు కూడా తప్పక హాజరు కావాలని సీసీలు హుకుం జారీ చేశారు. దీంతో వచ్చిన డ్వాక్రా మహిళలకు సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. మహిళలు కూర్చునేందుకు కుర్చీలు లేక ఎండలోనే కొంత మంది నేలపై మరికొందరు ప్రహరీ పై కూర్చున్నారు. మరికొందరు నిలబడలేక వచ్చిన కొద్దిసేపటికే తిరుగు ప్రయాణం పట్టారు. ఏమైనా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని మహిళలు గుసగుసలాడుకోవడం గమనార్హం.

పని చేసిన వారికి తగిన గుర్తింపు

వేంపల్లె, జనవరి 30: తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, కడప పార్లమెంట్ అధ్యక్షుడు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాల యంలో మైనార్టీ మండల కార్యదర్శిగా ఫయాజ్, బీసీ విభాగం మండల ఉపాధ్యక్షుడుగా మడకా శ్రీనివాసులుకు మంగళవారం నియామక పత్రాలు అందించారు. రాబోవు రోజుల్లో మరింత ఉత్సాహంగా పనిచేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, ఉపాధ్యక్షుడు భద్ర, వేమకుమార్, మండల మాజీ కార్య దర్శి పాపిరెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు వల్లి, డాక్టర్ కరీము ల్లా, గోగుల మల్లి, మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పీగా చెరుకూరి శ్రీను

వేంపల్లె, జనవరి 30: సర్వశిక్ష అభియాన్ ఎస్ఆర్‌పీగా వేంపల్లెకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు చెరుకూరి శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. లిప్ మానిటరింగ్ కార్యక్రమం ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నారు.

కార్మికుల పట్ల నిరంకుశ వైఖరి తగదు




ప్రొద్దుటూరు, మైదుకూరులలో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 30 : ఆర్టీసీ డిపోలో మంగళవారం నేషనల్ మజ్దూరు యూనిటీ అసోసియేషన్ నాయకులు ధర్నా నిర్వహించారు. డిపో కార్యదర్శి బానుప్రసాద్ మాట్లాడుతూ విశాఖపట్నం డీటీపీఓ కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, ఎన్ఎంయూఏ నాయకులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, వైఆర్‌కే రెడ్డి, వీటీ రావు, అశోక్ కుమార్, అయ్యవారప్ప, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు..: విశాఖ జిల్లా డీటీపీవో అప్పలనాయుడు అనాలోచిత నిర్ణయాలతో సంస్థను నష్టాలపాలు చేస్తున్నారంటూ ఆర్టీసీ కార్మికులు మంగళవారం డిపో గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్ష, కార్యదర్శులు బీయస్ రెడ్డి, సిద్దయ్య మాట్లాడుతూ అనేక సర్వీసులను రద్దు చేసి, సంస్థ ఆదాయానికి గండి కొట్టారని, దీంతో ఆయన పద్ధతి మార్చుకోవాలంటూ సలహాలు ఇచ్చిన మజ్దూర్ యూనియన్ కార్మికులపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. ఆయనకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు.యూనియన్ కార్మికులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో 7.52 టీఎంసీల నీటిమట్టం

కొండాపురం, జనవరి 30 : గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 7.52 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు.205.82 అడుగుల వద్ద ఈ నీటిమట్టం ఉందన్నారు.ప్రస్తుతం గండికోట ఎత్తిపోతల పథకం ద్వారా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందన్నారు.కాగా ప్రస్తుతం గండికోట నుంచి మైలవరం జలాశయానికి నీరు వదడం లేదు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధంకండి

పోరుమామిళ్ల, జనవరి 30 : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని రచయిత గఫార్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ అన్నారు. మంగళవారం పోరుమామిళ్లలో ఓఎల్ఎఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యరాణి అధ్యక్షతన పది పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యరాణి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

2న మాజీ సైనిక సంక్షేమ సంఘం సమావేశం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 30 : మాజీ సైనికుల సంక్షేమ సంఘం సమావేశం రెండో తేదీ ఉదయం 10 గంటలకు హౌసింగ్ బోర్డు కాలనీలోని టీఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు బాల వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికులు, వీరనారీమణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

బ్రహ్మంగారిమఠం, జనవరి 30 : మండల కేంద్రంలోని స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, దీప్తి పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతావారోత్సవాలపై బద్వేలు ఆర్టీవో శేఖర్‌రావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దీప్తి పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మెడికల్ క్యాంపు

గోపవరం, జనవరి 30: మండల పరిధిలోని పీపీ కుంట వద్ద జడ్పీహెచ్ స్కూలు ఆవరణలో బుధవారం ఉదయం 9గంటలకు మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు సెంచురీప్లే కంపెనీ అధికారులు తెలిపారు. రోగులకు కావాల్సిన మందులు ఉచితంగా అందిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పదిలో ఉత్తమ మార్కులు సాధించడమే లక్ష్యం



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు ,జనవరి 30 : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదివే బాల,బాలికలు పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడమే లక్ష్యంగా ప్రేరణ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘికసంక్షేమ అధికారి సరస్వతి పేర్కొన్నారు. మంగళవారం నడింపల్లెలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ప్రేరణ శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో గురుప్రసాద్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని సమాజంనుంచి పారదోలుదాం



కుష్టువ్యాధి నిర్మూలన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రొద్దుటూరు , జనవరి 30: కుష్టువ్యాధిని సమాజంనుంచి పారదోలడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కామనూరు వైద్య అధికారి హనీఫ్ బాబా పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయ కుష్టు నిర్మూలన వారోత్సవాల సందర్భంగా చెన్నమరాజుపల్లెలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్,సూపర్‌వైజర్ వరప్రసాద్, శ్రీను, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

స్కిప్పింగ్ పోటీల్లో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన హైస్కూల్ విద్యార్థులు

మైదుకూరు, జనవరి 30 : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 28,29న జరిగిన స్కిప్పింగ్ పోటీలలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ చూపారు. బాలుర విభాగంలో మహ్మద్‌బాష, ఆరీఫ్, హరీశ్వర్, పృథ్వీరాజ్, లతీఫ్, సాహెల్, రిహాన్ ప్రతిభ చూపి ప్రశంసా పత్రాలు పొందారు. కాగా ఈవిద్యార్థులను మంగళవారం ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, వ్యాయామా ఉపాధ్యాయినిరాలు చంద్రావతి, వినోనియా రాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాత్మునికి ఘన నివాళి



పోరుమామిళ్లలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బద్వేలు మాజీ ఎమ్మెల్యే పీఎం కమలమ్మ

బద్వేలు రూరల్, జనవరి 30 : మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద ఆవాజ్ కమిటీ, ప్రజా సంఘాల నాయకులు, ఆర్యవైశ్యలతో కలిపి మహాత్మునికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. అదే విధంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు.

పోరుమామిళ్ల..: పోరుమామిళ్లలోని మహాత్మాగాంధీ విగ్రహానికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే కమలమ్మ పూలమాలలు వేసి నివాలులర్పించారు. మంగళవారం కమలమ్మ , నాయకులు ప్రభాకర్, కమల్ ప్రభాస్, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు.

మైదుకూరు..: వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. నాయకులు డీవీ సునీల్, యెలిశెట్టి ప్రసాద్, దొంతి వెంకట సుబ్బయ్య, పల్లె వెంకటేశ్వర్లు, శంకూరి రమణయ్య, పబ్బతి గోపాల్, చిలంకూరి మారుతి, మణికంఠ, సురేంద్ర, మలిపెద్ది హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బద్వేలులో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మైదుకూరులో నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు